www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 17 నవంబర్ 2022 | 5 | కాకినాడ

24 నుంచి బాలల సైన్స్ కాంగ్రెస్

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లా స్థాయి 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌ను ఈ నెల 24, 25న కాకినాడ గీతం ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని డిఇఒ డాక్టర్ సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి శాస్త్ర సాంకేతిక మండలి, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రాజెక్టులు ఈ జిల్లా స్థాయి ప్రాజెక్టుల కాంపిటీషన్‌లో పాల్గొనాలని తెలిపారు. ఇప్పటికే 217 ప్రాజెక్టులు నమోదయ్యాయని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెంచడానికి, పర్యావరణంపై స్పృహను పెంచడానికి బాలల సైన్స్ కాంగ్రెస్ సహకరిస్తుందని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస వినీల్, గీతమ్ పాఠశాల కరస్పాండెంట్ ఎమ్.సుజ్జాన్, ప్రిన్సిపల్ సురభి శారద పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలా..

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జవహర్‌లాల్ సాంకేతిక విశ్వవిద్యాలయ ఓడీల తప్పిదంపై కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనబడుతోంది. వర్సిటీలో విసిలు మారినా కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారి సీటు మాత్రం ఎవరూ కదిలించలేకపోతున్నారు. గతంలో ఎగ్జామినేషన్ సెల్లో స్పెషలిస్టు కోర్సుల్లో వ్యవహారంలో అధిక మొత్తంలో డబ్బులు చెల్లించారనే భారీ స్థాయి వివాదాలు చోటుచేసుకున్నాయి. మూడేళ్లుగా ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించిన కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ (ఇసి) ఇటీవల అంతర్గత ఆరోపణల వల్ల ఒక విభాగాధిపతికి ఆ బాధ్యతలు అప్పగించారు. అది మరవక ముందే మరలా ఓడీల ముద్రణలో భారీ తప్పిదం జరిగింది. దీనికి పూర్తిస్థాయిలో బాధ్యత వహించాల్సింది కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారి మాత్రమే. దాదాపు నాలుగేళ్లుగా అదే సీటుకే పరిమితమై సేవలందించడం వల్ల ఈ తప్పిదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. విద్యార్థికి చిరునామాగా ఉండే ఓడీలో ముద్రణలో జాగ్రత్త తీసుకోవాల్సింది పోయి అసమర్థంగా కింది ఉద్యోగులను ప్రోత్సహించడం సరికాదు. ఇదే పరిస్థితి పలుమార్లు జరుగుతున్న జెఎన్‌టియుకె అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా దీనిపై ఉన్నత విద్యా మండలి ప్రత్యేక కమిటీ వేసి జెఎన్‌టియుకె పరీక్ష విభాగ కేంద్రంపై చర్య తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జెఎన్‌టియుకెలో ఉన్నతాధికారులు ఎంతటి తప్పునకు పాల్పడినా కిందిస్థాయి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను బలి చేస్తున్నారు. గతంలో జెఎన్‌టియుకె అతిథి గృహంలో జరిగిన శోభనం సంఘటనపై ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తప్పిదంగా చిత్రీకరించి వారిని ఉద్యోగం నుంచి కొన్ని రోజులు తప్పించారు. వాస్తవానికి అతిథి గృహాన్ని బుక్ చేసిన ఒక ఉన్నతాధికారిని సైతం ఇటువంటి చర్యలు లేవు. ఇప్పుడు ఓడీల ముద్రణలో జరిగిన తప్పిదానికి సైతం కిందిస్థాయి ఉద్యోగులైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను బలి చేస్తున్నారు. జెఎన్‌టియుకె పరిపాలన విభాగం నుండి ప్రతి ఏడాది విభాగాధిపతులను మార్చే సంస్కృతి ఎప్పటినుండో కొనసాగుతోంది. కానీ జివిఆర్ ప్రసాదరావు విసిగా బాధ్యతలు చేపట్టి ఏడాది కాలం పూర్తయినా విభాగాల అధిపతుల మార్పుల్లో ఎటువంటి చలనం లేదు. దీనికి కారణం ఆయనకు అందరూ అనుకూలంగా ఉండడమే అంటున్నారు. యూనివర్సిటీ పరువు పోతున్నా ఇలాంటి ఘటనలు ఎదురైన ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం హాస్యాస్పదంగా ఉందని, ఇలాంటి అసమర్థ చర్యలకు పాల్పడుతున్న కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారిని వెంటనే మార్చాలని పలువురు విద్యావేత్తలు కోరుతున్నారు.

బాధిత విద్యార్థుల్లో ఆందోళన

జెఎన్‌టియుకె పరీక్ష విభాగంలో ఓడీలు పొందిన విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు విద్యార్థులు విదేశాల్లో ఉంటే మరి కొందరు ప్రభుత్వ కొలువుల్లో స్థిరపడ్డారు. గతేడాది మార్చిలో జరిగిన ఈ తప్పిదాన్ని ఇప్పుడు సరి చేస్తాం రండి అంటే ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు. జెఎన్‌టియుకె నుండి ఎటువంటి సమాచారం అయినా సంస్థ వెబ్‌సైట్‌లో పొందుపరచాలి, లేదా విద్యార్థి చదివిన కళాశాల ద్వారా సమాచారాన్ని అందించాలి, లేదా విద్యార్థికి వ్యక్తిగతంగా అయినా ఓడీ ముద్రణలో తప్పు జరిగిందని తెలియజేయాలి. అవేమీ చేయకుండా ఓడీలు తీసుకుని ఏడాది తరువాత విద్యార్థులకు ఫోన్ చేసి ఓడీ పట్టాలను జెఎన్‌టియుకె పరీక్ష కేంద్రానికి రావాలని యూనివర్సిటీ అధికారులు ఆదేశిస్తున్నారు. విషయం పూర్తిగా చెప్పకపోవడంతో విద్యార్థుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది.

మిస్ కోడింగ్‌పై విచారణ చేయాలి : ఎస్ఎఫ్ఐ

వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ బృందం

ప్రజాశక్తి-కాకినాడ

జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో బిటెక్ డిగ్రీ పట్టా మిస్ కోడింగ్ విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలని, కమిటీ వేసి కమిటీ రిపోర్ట్‌ను బహిరంగ ప్రకటించాలని కోరుతూ విసి ప్రసాదరావుకు ఎస్ఎఫ్ఐ బృందం బుధవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.రాజా, నగర కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు మాట్లాడుతూ జెఎన్‌టియుకె రాష్ట్రంలోనే అతిపెద్ద సాంకేతిక విశ్వవిద్యాలయం అన్నారు. 8 జిల్లాల పరిధిలో 205 ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయన్నారు. ఇంజినీరింగ్ కళాశాలలో లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఈ పరిధిలో చదువుతున్న విద్యార్థులందరికీ యూనివర్సిటీ ద్వారానే డిగ్రీ పట్టా అందజేస్తారన్నారు. యూనివర్సిటీలో ఎగ్జామినేషన్ సెల్లో జరిగిన మిస్ కోడింగ్ వల్ల వందలాది మంది విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. యూనివర్సిటీ ఇచ్చిన పట్టా పట్టుకుని విదేశాలకు వెళ్లిన విద్యార్థులను వెనుకకు తిరిగి రావాలని, ఇచ్చిన పట్టాలో తప్పులు ఉన్నాయని ఫోన్ చేయడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. అనేకమంది విద్యార్థులు వివిధ ఉద్యోగాల్లో ఇతర రాష్ట్రాల్లో చేరారన్నారు. యూనివర్సిటీ అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన విసి ప్రసాద్‌రావు పట్టా మిస్ కోడింగ్ సమస్య తన దృష్టిలో ఉందన్నారు. ఈ సమస్యపై యూనివర్సిటీలో ఎగ్జామినేషన్ సెల్లో పనిచేసిన సీనియర్ అధికారులతో ఒక కమిటీ వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు బి శివరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్‌తో ప్రపంచవ్యాప్త అవకాశాలు

ప్రజాశక్తి-కాకినాడ

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, కలెక్టర్, ఎంఎల్‌ఎలు

ప్రపంచవ్యాప్త అవకాశాలను అంది పుచ్చుకునేందుకు, జీవితంలో ఆత్మస్థయిర్యంతో ముందడుగు వేసేందుకు ఇంగ్లిష్ భాష వారధి వంటిదని కాకినాడ ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్మార్ట్‌సిటీ సమావేశ మందిరంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో రెడీనెస్ ఇనిషియేటివ్ ఫర్ సిట్యుయేషనల్ ఇంగ్లిష్ (ఆర్ఐఎస్ఇ) కార్యక్రమాన్ని ఎంపీ వంగా గీత, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, కాకినాడ రూరల్, అర్బన్ ఎంఎల్‌ఎలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విద్యాశాఖ ఆర్‌జెడి డి.మధు సూదనరావు, డిఇఒ డి.సుభద్ర, కార్యక్రమ కోఆర్డినేటర్ జివి.ప్రసాద్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గత ఆగస్టు 1వ తేదీ నుంచి తుని నియోజక వర్గంలోని పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు. ఇప్పుడు కాకినాడ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో అమల్లోకి వస్తుంది. దశల వారీగా జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో ఈ కార్యక్రమం అమలవు తుంది. ఈ సందర్భంగా బెండపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులు తమ ఇంగ్లిష్ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు కార్యక్రమాలు అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులను వారు అభినందించారు.

రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

ధాన్యం కొనుగోలుకు నిబంధనల పేరుతో పండించిన కౌలు రైతు వద్ద ధాన్యం కొనుగోలు చేయడం లేదని, దీని వల్ల గ్రామ స్థాయిలో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో గ్రామాల్లో సాగు చేస్తున్న రైతాంగం వద్ద వివరాలు సేకరించినట్లు చెప్పారు. కరప మండలం, సామర్లకోట మండలం ఉండూరు, వేమవరంలో పంట పొలాలు పరిశీలించామన్నారు. నూటికి 90 శాతం వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులు సిసిఆర్‌సి కార్డులు లేక, పండించిన పంట అమ్ముకోలేక ఇబ్బందులు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సాగుదారులు వద్ద పంట కొనుగోలు చేస్తామని ప్రకటనల్లో ఊదర కొడుతున్నారని. కానీ క్షేత్ర స్థాయిలో రైతులు, కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని రాజశేఖర్ తెలిపారు. క్షేత్ర స్థాయి ఇబ్బందులు అగ్రికల్చర్ జేడీ, సివిల్ సప్లై ఎండీ దృష్టికి సమస్యలు తీసుకువెళ్లినట్టు రాజశేఖర్ తెలిపారు. సిసిఆర్‌సి కార్డు లేకపోయినా కౌలు రైతులు వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని రాజశేఖర్ డిమాండ్ చేశారు. జిల్లా ప్రొక్యూర్మెంట్ టార్గెట్ కూడా తగ్గించారని, ఇది ప్రైవేట్ వ్యాపారులకు రైతాంగాన్ని అప్పగించడమేనని చెప్పారు. మండలాలకు కేటాయించిన స్పెషల్ అధికారులు, ఆర్‌బికె కేంద్రాలకు కేటాయించిన మండల అధికారులు క్షేత్ర స్థాయిలో సమస్యలపై దృష్టి పెట్టాలని సిపిఎం కోరుతోందని రాజశేఖర్ తెలిపారు. ధాన్యం తూకంలో 76, 77 కేజీలు తూకం యు.కొత్తపల్లి మండలంలో తూస్తున్నారని వీటిని అరికట్టాలన్నారు. బయట వ్యాపారులకు అమ్మే సూపర్ ఫైన్ రకం ధాన్యం రేటు రూ.250 నుంచి రూ.300 తక్కువకు కొనుగోలు చేస్తున్నారన్నారు. పట్టుబడి కూలీ డబ్బులు ధాన్యం డబ్బులతో కలిపి ఇస్తామని, రైతులే పెట్టుకోవాలని చెప్పడం సరికాదన్నారు. ఇది రైతులపై మరింత భారం వేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టుబడి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కరపత్రాలతో 'పట్టాభి' కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పెద్దాపురం

స్థానిక వాలుతిమ్మాపురం రహదారిలోని పట్టాభి ఆగ్రో ఫుడ్స్ పరిశ్రమలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ బుధవారం కార్మికులు ఎడిబి రోడ్డులో ప్రజలకు, కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయమని అడిగినందుకు పట్టాభి పరిశ్రమలో అన్యాయంగా కార్మికులను తొలగించారన్నారు. రెండు నెలలుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో తొలగించిన 20 మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఈ పరిశ్రమలో కార్మికులకు సంబంధించి చట్టాలు అమలు కావడం లేదన్నారు. వెంటనే యాజమాన్యం స్పందించి కార్మికులను విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే కార్మికులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.క్రాంతికుమార్, బేదంపూడి పెదబాబు, పెంకే శ్రీను, గోళ్ల బాలరాజు, కోనా జాన్, యోహాన్ రాజు, దేవాబత్తుల రమేష్, కందా శివ పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్మికులు

రవిశంకర్‌కు గురు స్పందన పురస్కారం

ప్రజాశక్తి-గండేపల్లి

పురస్కారం అందుకున్న రవిశంకర్

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్‌కు స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయుల సదస్సులో 'గురు స్పందన" పురస్కారం అందుకున్నారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఇదా శామ్యూల్ రెడ్డి, రాజమహేంద్ర వరం జైళ్ల శాఖ సూపరింటెండెంట్ ఎస్.రాజారావు ఈ పురస్కారం అందజేసినట్టు తెలిపారు. ఒక మంచి సంస్థ ద్వారా గురు స్పందన పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందని డాక్టర్ రవి శంకర్ అన్నారు. పుస్తక రచయితగా, ఉపాధ్యాయులుగా ఎందరికో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీలో మార్గనిర్దేశం చేసిన గైడ్‌గా ఫార్మసి కళాశాల ప్రిన్సిపల్‌గా సేవలందిస్తున్న డాక్టర్ రవి శంకర్‌కు అవార్డు రావడం పట్ల ఆదిత్య అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, ఆదిత్య డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణరెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, ఆదిత్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సతీష్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సులతో ప్రయోజనం

ప్రజాశక్తి జగ్గంపేట

గ్రాడ్యుయేషన్ తర్వాత సర్టిఫికెట్ కోర్సులు చేయడం విద్యార్థులకు అవసరమని జగ్గంపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చంద్ర నాయుడు అన్నారు. జగ్గంపేట డిగ్రీ కళాశాలలో జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ సర్టిఫికెట్ కోర్సు రిసోర్స్‌పర్సన్ విద్యావేత్త డాక్టర్ డాక్టర్ ఒమ్మి రఘురాం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ చదివిన ప్రతి విద్యార్థి సర్టిఫికెట్ కోర్సులు చేస్తే ఫలితం ఉంటుందని ఆయన అన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఇండస్ట్రియల్, పిబి.దేవం ఫీడర్లపై మరమ్మతుల కారణంగా ఈ నెల 17వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఇఇ జి.ప్రసాద్ తెలిపారు. దీనివల్ల ఆర్‌బి.పట్నం, పిబి.దేవం, ఆర్‌బి.కొత్తూరు, జి.మేడపాడు, పిబి.దేవంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని తెలిపారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-సామర్లకోట

విద్యార్థులు అందరూ మంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పలువురు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రతిభ స్కూల్లోని విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభ కళాశాల కరస్పాండెంట్ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వించారు. ఈ సందర్భంగా సిఐ దుర్గాప్రసాద్ మాట్లాడారు. ఖుషి హాస్పిటల్ డాక్టర్ లక్ష్మి, పెద్దాపురం ప్రతిభ స్కూల్ ప్రిన్సిపల్ టి.అరుణ పాల్గొన్నారు.

19 నుంచి ఉచిత బియ్యం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన పథకంలో భాగంగా రెండు నెలలుగా ఇవ్వని ఉచిత రేషన్‌ను నవంబర్ నుంచి జనవరి వరకు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖలకు జిఒలను జారీ చేసింది. ఇందుకనుగుణంగా జిల్లాలో అర్హుల జాబితాను అధికారులు గుర్తించారు. జిల్లాల ఆరు లక్షలు రేషన్ కార్డుల లబ్ధిదారులు ఉండగా అందులో ఒక లక్ష 30 వేల మందిని అర్హులుగా గుర్తించారు. వీరి జాబితాను సంబంధిత సచివాలయం వద్ద, రేషన్ షాపుల వద్ద ఉంచినట్టు డిఎస్ఒ తెలిపారు.

దిశ పోలీస్ స్టేషన్‌లో సైబర్ కవచ్

ప్రజాశక్తి- కాకినాడ కార్పొరేషన్

సైబర్ నేరాలు, మాల్వేర్, స్పై యాప్స్ వంటి ప్రమాదకరమైన వాటి బారి నుంచి రక్షించుకునేలా కాకినాడ దిశ పోలీస్ కార్యాలయంలో సైబర్ కవచ్ మొబైల్ స్కానింగ్ సాధనాన్ని అందుబాటులో ఉంచారు. బుధవారం ఎస్‌పి ఎం.రవీంద్రనాథ్ బాబు ఈ పరికరాన్ని ప్రారంభించారు.

స్కానింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌పి

వ్య.కా.సంఘం సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

ఈ నెల 23న కాకినాడలో నిర్వహించే ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని చేయాలని సంఘం నేతలు పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల కార్యాలయంలో దుప్పి అదృష్టదీపుడు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. మహాసభలో మూడేళ్లలో మండలంలో వివిధ గ్రామాల్లో ప్రజల ఎదుర్కొంటున్న ఉపాధి హామీ, మంచినీరు, స్మశానాల ఆక్రమణ, స్థానిక సమస్యలు, ఉపాధి హామీ ధర్నాలు, అసైన్డ్ భూముల పోరాటం, కోరంగి కంపెనీ భూపోరాటం, సమస్యలపై సంఘం చేసిన పోరాటాలను నివేదిక రూపంలో చర్చించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ తాళ్లరేవు వ్యవసాయ కార్మిక సంఘం ప్రజా సమస్యలపై పోరాటంలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందని, రాబోయే కాలంలో మరింత బలాన్ని పుంజుకుని ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలన్నారు. ఈ సమావేశంలో ఎం.తణుకురాజు, ఎన్.త్రిమూర్తులు, సిహెచ్.వెంకటలక్ష్మి, డి.శైలజ, పి.నందిని, టి.వెంకటరమణ, జి.భాస్కరరావు, కె.నాగేంద్ర కుమార్, వి.సత్తిరాజు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

మూఢ నమ్మకాల నిర్మూలనా చట్టం తేవడానికి ముహూర్తం కుదరడం లేదంటయ్యా ..!!



ఎస్‌పికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ బృందం

ర్యాగింగ్ నివారణకు ఎస్‌పికి వినతి

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో బిటెక్, డిగ్రీ, ఫార్మసీ, పీజీ విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్‌పై అవగహన కల్పించాలని కోరుతూ ఎస్‌పి రవీంద్రనాథ్ బాబుకు ఎస్ఎఫ్ఐ బృందం బుధవారం వినతిపత్రం ఇచ్చింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా, నగర కార్యదర్శులు టి.రాజా, ఎం.గంగా సూరిబాబు మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల ఇంజినీరింగ్, ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల్లో ర్యాగింగ్ ప్రభావం, మాదక ద్రవ్యాలు వినియోగం వంటి వ్యసనాలు విపరీతంగా పెరిగాయన్నారు. యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఉన్నా నామమాత్రంగా మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు శివరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగంతోనే రిజర్వేషన్లు బలోపేతం

ప్రజాశక్తి-కాకినాడ

సమావేశంలో మాట్లాడుతున్న శేషబాబ్జి

దేశంలో ప్రభుత్వ రంగం బలపడితేనే రిజర్వేషన్లకు ఉపయోగమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో సిఐటియు ఆధ్వర్యంలో ఇడబ్ల్యుఎస్ కోటా రిజర్వేషన్లు సుప్రీంకోర్టు తాజా తీర్పు అనే అంశంపై బుధవారం చర్చాగోష్టి నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రస్తుత ఇడబ్ల్యుఎస్ కోటా రిజర్వేషన్ నిబంధనల వల్ల పేదలకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. ప్రభుత్వరంగం బలపడాలని, ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ప్రముఖ న్యాయవాది జవహర్ అలీ మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా దేశంలో రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతూనే ఉందన్నారు. రాజ్యాంగబద్ధంగా నడవాల్సిన సంస్థలన్నీ ప్రణాళికాబద్ధంగా నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు ఏకమై రాజ్యాంగ రక్షణ ఉద్యమం చేపట్టాలన్నారు. ఫ్రీలాన్స్ జర్నలిస్టు మలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ రిజర్వేషన్లకు సామాజిక వెనుకబాటుతనమే ప్రామాణికమన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పులో అంశాలను వివరించారు. ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనంలో ముగ్గురు మెజారిటీతో ఇచ్చిన ఈ తీర్పు గత తీర్పులకు విరుద్ధంగా ఉందన్నారు. ఈ తీర్పుపై సుప్రీం కోర్టు ఫుల్ బెంచ్‌కు వెళ్లే అవకాశం ఉందన్నారు. అంబేద్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు, ఆర్‌పిఐ నాయకులు పిట్టా వరప్రసాద్, మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు వల్లూరి సత్తిబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు కె.సత్తిరాజు, బిఆర్‌డి.రాయ్, పి.రామకృష్ణ, బయ్యా రాజేంద్ర కుమార్, నేతల నూకరాజు, నాగాబత్తుల సూర్యనారాయణ తదితరులు మాట్లాడారు. పలివెల వీరబాబు ఆహ్వానం పలుకగా మలక వెంకట రమణ వందన సమర్పణ చేశారు. జి.బేబిరాణి, మేడిశెట్టి వెంకట రమణ, శాంతి సుకుమార్, వరసాల జాన్ ప్రభాకర్, రాయుడు మోజేష్, కొల్లి రమేష్, పాలిక రాజేంద్ర ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని సస్పెన్షన్‌పై విచారణ

ప్రజాశక్తి-కరప

విచారణ చేస్తున్న డివైఇఒ

కరప నక్కా సూర్యనారాయణ మూర్తి జెడ్‌పి హైస్కూల్లో ఉపాధ్యాయుడు వెంకట గంగాధర్ వచ్చిన ఆరోపణలపై ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బుధవారం డివైఇఒ ఆర్.జాన్ డేనియల్ రాజు విచారించారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని గాయపరిచాడనే అభియోగంపై సోషల్ మీడియాలో వచ్చిన సంఘటనతో ఉపాధ్యాయుని సస్పెన్షన్ చేయడంపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కాకినాడ డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ జాన్ డేనియల్ రాజు కరప హైస్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీని విచారించారు. విద్యార్థి తల్లిదండ్రులు విద్యార్థితో కలిసి తమకు ఎటువంటి గాయాలూ కాలేదని రాతపూర్వకంగా ఇచ్చినట్లు తెలిసింది. ఎంఇఒ కెబి.కృష్ణవేణి , పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీపాదం రమాదేవి, హెచ్‌ఎం యు.లీలా మనోహర్ పాల్గొన్నారు.

పరిశ్రమలకు ప్రోత్సాహకాలు మంజూరు

ప్రజాశక్తి-కాకినాడ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై 30 దరఖాస్తులకు సంబంధించి వివిధ పరిశ్రమల ప్రోత్సాహకాల కింద రూ.2.38 కోట్లు మంజూరు చేసినట్టు కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరు కార్యాలయంలో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, పరిశ్రమలు, ఎపిఐఐసి, గ్రౌండ్ వాటర్, ట్రాన్స్‌పోర్టు, అగ్నిమాపక, పంచాయతీ, ఫ్యాక్టరీస్, ట్రాన్స్ కో, లీడ్ బ్యాంకు తదితర శాఖలతో కలిసి జిల్లాస్థాయి పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గత నెల జరిగిన సమావేశంలో తీర్మానించిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలపై కమిటీ తొలుత చర్చించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు ఏక గవాక్ష విధానంలో వచ్చిన 23 దరఖాస్తులలో 15 దరఖాస్తులను కమిటీ ఆమోదించినట్టు తెలిపారు. వీటిలో ఒక దరఖాస్తును తిరస్కరించగా ఏడు దరఖాస్తులు వివిధ దశల్లో ఉన్నాయని కలెక్టరు తెలిపారు. ఎంఎస్ఎంఇలకు సంబంధించి 30 దరఖాస్తులకుగాను రూ.2.38 కోట్ల నిధులు మంజూరు చేయగా ఇందులో జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా ఎస్‌సి, ఎస్‌టి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రూ.2.08 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టరు అధికారులను ఆదేశించారు.

సోలార్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలోని ఎన్‌సిసి ప్రధాన కార్యాలయంలో సోలార్ ప్లాంట్‌ను కల్నల్ ఎకె.రిషి బుధవారం ప్రారంభించారు. స్థానిక అశోక్ నగర్‌లో ఎన్‌సిసి ప్రధాన కార్యాలయంలో హర్షిత ఎనర్జీ సిస్టమ్స్ ద్వారా సుమారు రూ.10 లక్షలతో విద్యుత్తు కోసం ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్‌ను కల్నల్ ఎకె రిషి, గ్రూప్ కమాండర్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి విద్యుత్తు ఉపయోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ అనిల్, హర్షిత ఎనర్జీ సిస్టమ్స్ అధినేత చైతన్య, రమేష్ పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులు

షూటింగ్‌లో విద్యార్థుల హవా

ప్రజాశక్తి-కాకినాడ

సౌత్ జోన్ నేషనల్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో కాకినాడ వాసులు పతకాల పంట పండించారు. ఈ నెల 12,13 తేదీల్లో తమిళనాడులోని కరూర్‌లో నిర్వహించిన ఎయిర్ గన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ జోన్ నేషనల్ రైఫిల్ అండ్ ఫిస్టల్ షూటింగ్ పోటీల్లో కాకినాడకు చెందిన ఐదుగురు అండర్-10, అండర్-17, అండర్-19 విభాగాల్లో రజిత, కాంస్య పతకాలు సాధించారు. అండర్-10 విభాగంలో చంద్ర హాసన్, ధూపం వేద్ లు కాంస్య పతకాలు, అండర్-17 విభాగంలో అఖిల్ కాంస్య పతకం, విసరపు స్వాతి రుచిత రజిత పతకం, అండర్-19 విభాగంలో విసరపు ఐశ్వర్య రజిత పతకం సాధించారు.

అవార్డు గ్రహీతలు ఎంపిపి సత్తిబాబు, ఎంపిడిఒ

అవార్డులతో మరింత బాధ్యత

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

అవార్డులు రావడం వల్ల మరింత బాధ్యతను పెంచుతుందని సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలితలు పేర్కొన్నారు. విశాఖపట్నంకు చెందిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సేవారత్న పురస్కారానికి ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలితను ఎంపిక చేశారు. ఇటీవల విశాఖపట్నంలో వారిని ఆవార్డులతో సత్కరించారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న శేషబాబ్జి

సిఐటియు పెద్దాపురం మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పిఠాపురం

స్థానిక బైపాస్ రోడ్డులోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సిఐటియు మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. కరణం విశ్వనాథం అధ్యక్షతన తొలుత సంతాప తీర్మానాన్ని ఎల్ఐసి ఏజెంట్ల సంఘం నాయకులు కెవి.సత్యనారాయణ ప్రవేశపెట్టి నివాళులర్పించారు. అనంతరం కుంచే చిన్న కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. మహాసభలో పాల్గొన్న సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.శేషబాబ్జి మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వారికి అప్పనంగా కట్టబెడుతూ మరోపక్క నిరుద్యోగులకు ఉపాధి కల్పించకుండా పరిశ్రమలు మూసేస్తుందని విమర్శించారు. అధికార వైసిపి, టిడిపి ఎంపిలు నోరు మెదపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు జి.అప్పారెడ్డి, కెవివి.సత్యనారాయణ, ఎన్.సూర్యనారాయణ, కోనేటి రాజు, డి.పద్మ, సత్యవతి, నందీశ్వరరావు, ఎన్.ఏసమ్మ, సిహెచ్‌వి.రమణ సూర్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం పిఠాపురం మండల సిఐటియు నూతన కమిటీని ఎన్నుకున్నారు.

చిన్నారుల నుంచే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-సామర్లకోట

మూడేళ్ల వయసున్న చిన్నారి మొదలు వృద్ధుల వరకు జగనన్న సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రజలకు అందిస్తున్నారని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సామర్లకోట మున్సిపాలిటీలోని రెండు, మూడు వార్డుల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని హౌసింగ్ చైర్మన్ దొరబాబు బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలు అందరి హృదయాల్లో ఎంతో ఆదరాభిమానాలు సంపాదించుకున్నారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్, కౌన్సిలర్లు పాలిక కుసుమ చంటిబాబు, మర్రి శేషారావు, పిట్టా సత్యనారాయణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సల్లూరి కళ్యాణ్ పాల్గొన్నారు.

తక్షణం ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-కాజులూరు

రైతులు పండించిన ధాన్యాన్ని తక్షణ మే ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తణుకువాడ, గొల్లపాలెం, ఆర్యవటం, తర్లంపూడి తిప్పరాజుపాలెం, కాజులూరులో ధాన్యం మాసూలు చేసిన రైతులతో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ కోతలు నూర్పు మొదలుపెట్టి 15 రోజులు కావస్తోందన్నారు. ప్రతి గ్రామంలో ధాన్యం రాశులు ఉన్నా నేటికీ కొనుగోలు చేయకపోవడంతో పండించిన ధాన్యం ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని రైతులు అంటున్నారన్నారు. వర్షం కానీ వస్తే ఈ ధాన్యమంతా తడిసిపోతుందని వెంటనే కొనుగోలు చేయాలని చెప్పి రైతులు వాపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సువ్వారి గోవింద్, దంగేటి చినఅప్పారావు, నొక్కు శ్రీనివాస్, పోతుల వెంకటరమణ, బత్తుల బుల్లయ్య, వాసంశెట్టి సత్యనారాయణ, కుడుపూడి భూచక్రం, నామా చంద్రరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న మానవత

మహిళకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మలకపల్లికి చెందిన బాణాల రమణమ్మ(75)కు మానవతా సంస్థ బుధవారం రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించింది. సంస్థ మండల అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడారు. అన్నార్తులను, ఒంటరి మహిళలను ఆదుకోవాల్సిన బాధ్యత అందిరపైనా ఉందన్నారు. ఒంటరిగా ఉండడమే కాకుండా ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకున్న రమణమ్మకు ఈ మేరకు ఆర్థిక సాయం అందించామన్నారు. సంస్థ రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య మరో రూ.500 సాయాన్ని అందించారన్నారు. కార్యక్రమంలో ఎస్.సుబ్బారావు, సిహెచ్. ఆంజనేయులు, ఎస్.రాజశేఖర్, అప్పన చంద్రధరగుప్త తదితరులు పాల్గొన్నారు.

సమావేశం:లో మాట్లాడుతున్న అనంతలక్ష్మి

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -మండపేట

విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని విలేజ్, వార్డ్ సెకటేరియట్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బి. అనంతలక్ష్మి అన్నారు. బుధవారం రాయవరంలోని రామయ్య జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె పరిశీలించారు. భోజన పథకం నాణ్యత, రుచిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా ప్రోత్సహకాలు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి పథకం తదితరు పథకాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పప్పు శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99189

'బాబుతోనే గిరిజన ప్రాంతాల అభివృద్ధి'

ప్రజాశక్తి -రౌతులపూడి

గిరిజన ప్రాంతాల అభివృద్ధి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమైందని టిడిపి పరిశీలకుడు బండారు సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంఎల్‌సి టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ప్రత్తిపాడు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల రాజా ఆధ్వర్యంలో బుధవారం జాల్దాం గ్రామంలో నిర్వహించిన గిరిజన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు విద్యా వైద్యం, తాగునీరు రహదారి నిర్మాణ పనులు వంటి అనేక సంక్షేమ పథకాలు అందించినట్టు చెప్పారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం గిరిజన అటవీ ప్రాంతాల్లో ఉన్న గనులను దోచుకోవడంలో ఉన్న శ్రద్ధ గిరిజనుల అభివృద్ధిలో మాత్రం పాటుపడలేదన్నారు. ప్రతిపాడు నియోజకవర్గంలో 56 గిరిజన గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంలో విలీనం చేయకుండా విలీనానికి వ్యతిరేకంగా స్థానిక అధికార పార్టీ నేతలు తీర్మానాలు చేయించారని ఆరోపించారు. అనంతరం ముగ్గురు వార్డు మెంబర్లతో కలిసి 100 కార్యకర్తలు టిడిపిలో చెరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కాకినాడ పార్లమెంట్ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, తెలుగు యువత అధ్యక్షులు యనమల శివరామకృష్ణ, పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ ఎంపిపిలు బద్ది మణిరామారావు, భాస్కర్ బాబు, కొమ్ముల కన్నబాబు, సత్యనారాయణ, పైలా సాంబశివరావు, ఎస్.మౌళి ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

గ్రంథాలయాల ద్వారా విజ్ఞాన సముపార్జన

ప్రజాశక్తి-కాకినాడ

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మూడోరోజు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం గ్రంథాలయ ఉద్యమకారులను స్మరిస్తూ ఎంతోమంది త్యాగమూర్తులు ఫలితంగా ఈ గ్రంథాలయాలు ఏర్పాటు కాబడ్డాయని, విద్యార్థులంతా గ్రంథాలయాలను ఉపయోగించు కోవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆమె హితవు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న మదిలో మరో కలికితురాయి డిజిటల్ గ్రంథాలయాల ఆవిర్భావం అని, నేడు సాంకేతికత అభివృద్ధి చెందుతున్న తరుణంలో గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ముఖ్య అతిథిగా ఎపి డబ్ల్యుఐడిసి ఇఇ వి.లక్ష్మణ రెడ్డి మాట్లాడారు. ఐడియల్ డిగ్రీ కళాశాల చీఫ్ లైబ్రేరియన్ చింతపల్లి సుబ్బారావు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వివిఎల్ఎన్ఎస్‌వి.ప్రసాద్, ఉప గ్రంథాలయాధికారి ఆర్.వెంకటరాము, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తుమ్మలపల్లి జయకృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాగిరెడ్డి చంద్రకళ

పలువురికి దొరబాబు పరామర్శ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలో పలు కుటుంబాలను హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు బుదవారం పరామర్శించారు. ఉండూరులో బత్సుల సూర్యనారాయణ కుమారుడు బత్సుల సుబ్బారావు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని, ఇటీవల మృతి చెందిన నక్కా త్రిమూర్తులు కుటుంబాన్ని, చంద్రంపాలెంలో వైసిపి వికలాంగుల అధ్యక్షులు దేశిరెడ్డి గణపతి సోదరుడు దేశిరెడ్డి శ్రీను ఇటీవలే మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను, చంద్రంపాలెంలో ఇటీవలే ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న సన్నీబోయిన నూకరాజు కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, కో ఆప్షన్ సభ్యులు మండపాక సురేష్, సర్పంచ్ సీమల భవాని, నాగబోయిన రాజబాబు, సిద్ది సత్తిబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తంగెళ్ల రాధాకష్ణ, ఇజ్జిన తేజ, గుబ్బల అప్పన్న, సర్పంచ్ సీమల భవాని, నర్ల కొండలరావు, సత్యంశెట్టి సాయిబాబు, నందిపాటి వీరబాబు, సర్పంచి సత్యడి ధనలక్ష్మి సత్యనారాయణ, ఉప సర్పంచ్ కొప్పరెడ్డి రాధాకృష్ణ, పల్లా రాజాబాబు, సంకా కామేశ్వర గుప్త, పాలచర్ల సాయిబాబు, మాకిరెడ్డి రాంబాబు, నిడదవోలు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న దొరబాబు

2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-కాజులూరు

రెండున్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యమని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు యం.విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం కరప ఎడిఎ బాబూరావుతో కలిసి మండలంలోని శీల, కాజులూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అశోక్, సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు రామకృష్ణ, సర్పంచ్ కోమలి వెంకటరమణ, ఎఎబి చైర్మెన్ నల్లమిల్లి రామారెడ్డి, దంగేటి వెంకట సుబ్బారావు, గరగ కొండలరావు పాల్గొన్నారు.

ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఉపాధి పనుల గుర్తింపునకు ఆదేశం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో నూతన ఉపాధి పనులను గుర్తించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త పనులను గుర్తించి అంచనాలను తయారు చేయాలన్నారు. జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు 90 రోజుల పని దినాలకు పేమెంట్స్ అందేలా చూడాలన్నారు. రోజుకి 1,300 మ్యాండిట్స్ టార్గెట్‌గా ఇచ్చారు. ఉపాధి హామీ వర్కర్లకు ట్యాగ్‌తో కూడిన ఐడెంటి కార్డ్స్ విడతల వారీగా అన్ని గ్రూపులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిఎ.శ్రీనివాస్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్

సమావేశంలో పాల్గొన్న ఎంఎల్ఎ గోరంట్ల, బిసి నాయకులు

'బడుగు బలహీన వర్గాలకు అండగా టిడిపి'

ప్రజాశక్తి - కడియం

బడుగు, బలహీన వర్గాలకు టిడిపి అండగా ఉంటుందని ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు వేమగిరిలో రాష్ట్ర శెట్టిబలిజ కన్వీనర్ కుడిపూడి సత్తిబాబు అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన టిడిపి శెట్టిబలిజ సాధికార సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలను అణిచివేసే దిశగా ముఖ్యమంత్రి పాలన సాగుతుందన్నారు. పేదలకు, వెనుకబడిన వర్గాలకు అనేక పథకాలు ఇస్తున్నామని చెప్పుకోవడం తప్ప అవి ఎంతమంది వర్తిస్తున్నాయని ప్రశ్నించారు. బిసి నాయకులపై జగన్ నిర్లక్ష్య వైఖరి చూపిస్తున్నారన్నారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి బిసిలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, రాష్ట్ర శెట్టిబలిజ సాధికార కన్వీనర్ మునస అప్పారావు, పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పితాని శివరామకృష్ణ, జోగు చక్రవర్తి, గుత్తుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

6వ వార్డులో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-మండపేట

స్థానిక పురపాలక సంఘం పరిధిలోని 6వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు మాట్లాడుతూ సిఎం జగన్ తన సుదీర్ఘ పాదయాత్రలో పేదల కష్టాలు తెలుసుకొన్నారుని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు సిఎం జగన్ ప్రవేశ పెట్టారన్నారు. వలంటరీ వ్యవస్థ ద్వారా అన్ని పథకాలను ప్రతీ ఇంటికీ చేరవేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. అభివృద్ధి సంక్షేమమే పార్టీని అధికారంలోకి తీసుకొస్తాయని ఎంఎల్‌సి తోట ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ప్రజా సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో కో అప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకష్ణ, సాధనాల శివ భగవాన్, యరమాటి వెంకన్న బాబు, తదితరులు పాల్గొన్నారు.

వార్డు ప్రజలతో మాట్లాడుతున్న తోట

19న 'ధనలక్ష్మి' ముఖశిఖరం ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంకలో ధనలక్ష్మి అమ్మవారి ఆలయ ముఖ శిఖరం ఈనెల 19న ఆలయ అర్చకులు మున్నంగి ప్రభాకర శర్మ నేతృత్వంలో ఆవిష్కరిస్తారని, అమ్మవారుల విగ్రహాలు ప్రతిష్టాపన చేస్తున్నామని వైసిపి మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డితో పాటుగా నియోజకవర్గ ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు. ఇందులో భాగంగా అన్న సమారాధన కార్యక్రమంతో పాటుగా వివిధ ప్రదేశాల నుంచి వచ్చే యాత్రికుల తాకిడికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట వైసిపినేతలు దొండపాటి వెంకటేశ్వరరావు(బులిరెడ్డి), అడబాల వీర్రాజు, దొండపాటి చంటి, దొండపాటి శ్రీను, మోటూరి సురేష్, దొండపాటి వెంకట్రామయ్య, బి.వీర వెంకట్రావు, తమ్మన హరి, రాయుడు వెంకటేష్, బొర్రా వీరబాబు తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

విలేకరులతో అనుబంధం మరువలేనిది : కలెక్టర్

ప్రజాశక్తి-కాకినాడ

నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు చెందిన విలేకరులతో తనకున్న అనుబంధం మరువలేనిదని, విలేకరులకు విద్య, ఆరోగ్య పరంగా అన్ని విధాల తన వంతు సహాయం నిరంతరం ఉంటుందని కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అన్నారు. విలేకరులతో పాటు వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం పరంగా తనకు తెలియజేస్తే విధానపరంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని కలెక్టర్ విలేకరులకు భరోసా కల్పించారు. బుధవారం కాకినాడ ఆర్అండ్బి అతిథి గృహంలో కాకినాడ చిన్న మధ్య తరహా దినపత్రికల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమారాధన, జాతీయ పత్రికా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులుగా వారణాసి సూర్యనారాయణ, డాక్టర్ వైవి పరశురాం, అడపా అప్పారావులను ఘనంగా సత్కరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

మార్చిలో టిడ్కో గృహాల అప్పగింతకు చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వచ్చే ఏడాది మార్చి నాటికల్లా టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకొంటున్నామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం టిడ్కో ఇళ్ల నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల పథకంపై ప్రత్యేకాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం కాకినాడలో 2056 టిడ్కో ఇళ్లకు సంబంధించి ఇప్పటికే 1500 మంది లబ్ధిదారులకు రుణాల మంజూరు ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా వేగవంతంగా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని టిడ్కో అధికారులను ఆదేశించారు. టిడ్కో ఇళ్ల వద్ద రోడ్లు, డ్రెయిన్‌లు, విద్యుత్, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలను వేగవంతం చేయాలని కమిషనర్ కోరారు. ఇవన్నీ పూర్తిచేసి మార్చికల్లా లబ్ధిదారులకు ఇళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా పునాదుల స్థాయిలో ప్రతి లబ్ధిదారునికీ రూ.35 వేలు చొప్పున స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక తోడ్పాటు ఇచ్చేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డిఇ గుప్తా, టిపిఆర్ఒ మానే కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం, దూబచర్ల వద్ద, 16వ నెంబరు జాతీయ రహదారిపై. బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు నల్లజర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరవాసరం మండలంలో కలపూడి గ్రామారికి చెందిన గంధం దుర్గా వెంకటస్వామి నాయుడు (24) ఐసర్ వ్యాన్ లారీలో విశాఖపట్నం నుంచి విజయవాడకు కొబ్బరి బొండాలు వేసుకు వెళుతున్నాడు. అయితే నల్లజర్ల మండలం దూబచర్ల వద ఆగి ఉన్న లారీని వెనుక నుండి ఢీకొట్టడంతో దుర్గ వెంకటస్వామి నాయుడుకు తీవ్ర గాయాలు అయ్యాయి. అతనిని వెంటనే 108 లో ఏలూరు తరలించగా అక్కడినుంచి మెరుగైన చికిత్స కొరకు విజయవాడ మణిపాల్ ఆసుపత్రికి తరలించగా బుధవారం మధ్యాహ్నం ప్రాంతంలో మృతి చెందాడని నల్లజర్ల ఎస్ఐ అయ్యప్ప రెడ్డి తెలిపారు.

IN THE COURT OF THE V ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: KAKINADA
O.S. NO. 147 of 2022

Between:
KAKARAPALLI SRINIVAS ...Plaintiff
and
1) PAKA HARSHIL
2) PAKA JASIMITHA ...Defendants

To :
1) **Paka Harshil,** S/o. Paka Dora Babu (Late)
Flat No. 101, Padmavathi Residency,
Opp. Akhil Junior College,
Near Mother Teresa Statue,
Santhinagar, Kakinada - 533 003.
East Godavari District, A.P.
2) **Paka Jasimitha,** D/o. Paka Dora Babu (Late)
Flat No. 101, Padmavathi Residency,
Opp. Akhil Junior College,
Near Mother Teresa Statue,
Santhinagar, Kakinada - 533 003.
East Godavari District, A.P.

పై నెంబరు దావా గ్రంథం నందు ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టువారు నుండి సమన్లు పంపించిననూ పుచ్చుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున సదరు ప్రతివాదులు అయిన మీరు **ది. 25-11-2022వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** పైన ఉదహరించిన శ్రీ కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరు అయ్యి మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న శ్రీ కోర్టువారికి తెలియపరుచుకొనవలెను. లేని ఎడల శ్రీ కోర్టువారు మీ పరోక్షమునందు విచారించి తీర్మానము చేయుదురు అని యిందుమూలముగా తెలియజేయడమైనది.

పలివెల వెంకటేశ్వరరావు, B.Com., B.L.,
అడ్వకేట్, డో.నెం. 1-12-5, మిలిటరీ రోడ్,
కాకినాడ. భానుగుడి జంక్షన్ దగ్గర, కాకినాడ.
ది.16-11-2022 సెల్: 98488 48152

నేరాలు ఘోరాలు

బడ్డీ కొట్టు యజమానిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు చెరువు గట్టు సెంటర్లో నెలకొన్న బడ్డీ కొట్టు వివాదంలో కొట్టు యజమాని చిట్టూరి సత్యనారాయణ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడంతో పంచాయతీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాళ్లరేవు పంచాయతీ కార్య దర్శి శంకర నారాయణ మాట్లాడుతూ చెరువుగట్టు సెంటర్లో కోర్టు పరిధిలో ఉన్న స్థలంలో బడ్డీ కొట్టు తొలగించాలని యజమాని సత్యనారాయణకు నోటీసు ఇవ్వడానికి వెళ్లగా అతను తిరస్కరించాడన్నారు. ఆ నోటీసును బడ్డీ కొట్టుకు అతికించినట్లు తెలిపారు. కొట్టు తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటానని, పురుగుల మందు డబ్బాతో చిట్టూరి సత్యనారాయణ ఆత్మహత్యకు ప్రయత్నించడంతో అతనిని వారించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంపిడిఒ ద్వారా ఫిర్యాదు అందజేయాలని పోలీసులు తెలపడంతో మండల అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినట్లు కార్యదర్శి అన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో డ్రైవర్‌కు ఏడాది జైలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

రోడ్డు ప్రమాదంలో కేసులో ఒక వ్యక్తి మృతికి కారణమైన ఆర్‌టిసి బస్సు డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ బుధవారం కాకినాడ స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. సామర్లకోట సిఐ దుర్గా ప్రసాద్ ఇచ్చిన సమాచారం ప్రకారం 2019 డిసెంబర్ 15న సామర్లకోట శివారు షుగర్ ఫ్యాక్టరీ వద్ద బస్ డ్రైవర్ మోటార్ సైకిల్ ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో హుస్సేన్ పురం గ్రామస్తుడైన కోట చంట చనిపోయాడు. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ సుమంత్ బస్ డ్రైవర్ వళ్ళ నానయ్యను అరెస్ట్ చేసి దర్యాప్తు చేశారు. నిందితునిపై నేరం రుజువు కావడంతో బుధవారం కాకినాడ స్పెషల్ మొబైల్ జిఎఫ్‌సిఎం కోర్టు మెజిస్ట్రేట్ జానకి నిందితునికి ఒక ఏడాది జైలు, రూ. వెయ్యి జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఎపిపి విజయ వాదించారు.

నాలుగు టన్నుల ఐరన్ ఇప్పించాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

నాడు-నేడు పనులకు సంబంధించి ఆరు టన్నుల ఐరన్ ఇస్తానని అడ్వాన్స్ సొమ్ము తీసుకుని కేవలం రెండు టన్నులే ఇచ్చారని, మిగిలిన నాలుగు టన్నులు వ్యాపారి నుంచి ఇప్పించాలని పెదబ్రహ్మదేవం జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం జి.మల్లేశ్వరరావు బుధవారం సామర్లకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివి.. తమ పాఠశాల్లో నాడు-నేడు ఫేజులో పాఠశాల అదనపు గదుల నిర్మాణంలో భాగంగా విద్యా కమిటీలో తీర్మానం చేసి సామర్లకోటకు చెందిన బాలా త్రిపుర సుందరీ ట్రేడర్స్‌కు రూ.4,55,789 నెప్ట పద్ధతిలో అకౌంట్‌కు జమచేశానని హెచ్ఎం తెలిపారు. రెండు విడతులుగా రెండు టన్నులు ఇచ్చారని, మిగిలిన నాలుగు టన్నులు వాసిరెడ్డి ప్రసాద్‌తో స్కూల్‌కు పంపానని చెప్పాడని, అయితే నేటికీ తమకు అందలేదన్నారు. దీనిపై హెచ్ఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వరుస చోరీలతో ఆందోళన

ప్రజాశక్తి -చాగల్లు

చాగల్లులో వరుస దోపిడీలతో గ్రామస్థులు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామంలో వరుసగా గుర్తుతెలియని వ్యక్తులు దాడులు చేసి సెల్ ఫోన్స్, మేకలు, కోళ్ల దోపిడీకి పాల్పడుతున్నారు. మంగళవారం అర్ధరాత్రి చాగలు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వినాయక స్వామి, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్ల ఆలయ హుండీలను దుండగులు ఎత్తుకెళ్లారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు మాస్క్ ధరించి చోరీకి పాల్పడినట్లు సిసి కెమెరాలలో నమోదైనట్లు తెలుస్తుంది. ఈఘటనపై ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు చాగల్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

పడిపోయినవి

పెద్దాపురం మండలం, వడ్లమూరు గ్రామానికి చెందిన దేవళ్ళ హిమబిందు, భర్త: సత్య పవన్‌కుమార్ తెలియజేయునది ఏమనగా, నా తల్లి గారు మట్లపర్తి జానకిరాణి పేరున తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరువు మండలం, చిట్కూల్ గ్రామం నందు 300 చదరపు గజాలు ఇంటి స్థలం కలదు. దీనికి సంబంధించి **దస్తావేజు నెంబరు 4260/1987** ను తీసుకుని ది. 02-11-2022న వడ్లమూరు నుండి పెద్దాపురం మెయిన్‌రోడ్‌లోని జిరాక్స్ సెంటర్‌కు వెడుతుండగా పడిపోయినవి. దొరికినవారు ఈక్రింది అడ్రసుకు అందజేయవలసిందిగా కోరుతున్నాను.

ఇట్లు: దేవళ్ళ హిమబిందు
మట్లపర్తివారి వీధి, వడ్లమూరు
పెద్దాపురం మండలం, సెల్: 6305716079

ప్రకటన

పెద్దాపురం కాపురస్తులు హిందువులు **యెండ్రు గోవిందరావు గారి కుమారుడు యెండ్రు వీర వెంకట అయ్యప్పచౌదరి** ఇచ్చిన ప్రకటన.
నేను పెద్దాపురం కాపురస్తుడను. నేను ది. 14-11-2022వ తేదీన నా తాలూకు అనగా నా తల్లిగారైన యెండ్రు లేటు విజయలక్ష్మి గారి పేర్న గల రిజిస్టర్డ్ సేల్ డీడ్ ది. 7-7-2011 వైడ్.నెం. 2456/2011 గా గల ఒరిజినల్ దస్తావేజును కాపీ తీయించు నిమిత్తం పెద్దాపురం విక్టరీ బజార్ వద్ద పోగొట్టుకొని ఉన్నాను. సదరు నా తల్లి గారి పేర ఒరిజినల్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ ది. 7-7-2011 వైడ్.నెం. 2456/2011 ఎవరికైనా దొరికిన యెడల నాకు తిరిగి ఇవ్వవలసినదిగా కోరుచున్నాను. తగిన పారితోషికం ఇవ్వబడును. సదరు దస్తావేజుతో ఎటువంటి క్రయ విక్రయాదులు చేసిన చెల్లవు. నేను తీసుకొను చర్యలకు బాధ్యులు కాగలరని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

YENDRU VEERA VENKATA AYYAPPA CHOWDARY
S/o. Govindarao, D.No.2-12-4/b,
Ramaraopeta, Peddapuram, Cell: 9666176999